క్లుప్తంగా

నేడు కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై పుస్తకం ఆవిష్కరణ

నరసరావుపేట: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు కూటమి ప్రభుత్వ ఏడాది పాలన వైఫల్యాలపై పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆదివారం పార్టీ కార్యాలయ ప్రతినిధులు పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ పార్లమెంటు నియోజకవర్గ సమన్వయకర్త పూనూరు గౌతమ్‌రెడ్డి, జిల్లాలోని అన్ని నియోజకవర్గాల పార్టీ సమన్వయకర్తలు పాల్గొంటారని, అనంతరం ప్రెస్‌మీట్‌లో పాల్గొంటారన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



చిలకలూరిపేట(యడ్లపాడు): విద్యార్థులకు దాతలు చేయూతనివ్వడం అభినందనీయమని చిలకలూరిపేట మున్సిపల్ కమిషనర్ శ్రీహరిబాబు పేర్కొన్నారు. పట్టణంలోని సీఆర్ కాలనీ పార్కులో ఆదివారం రూ.10వేల విలువైన నోట్‌బుక్స్‌ను 25 మంది విద్యార్థులకు పంపిణీ చేశారు. సీఆర్ కాలనీ అసోషియేషన్ అధ్యక్షుడు గుడిపల్లి సాంబశివరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా కమిషనర్ శ్రీహరిబాబు, అర్బన్ సీఐ పి.రమేష్ పాల్గొని నోట్‌పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ సెక్రటరీ కోటి సుబ్బారావు, కోశాధికారి చిరుమెళ్ళ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత



వినుకొండ: పట్టణంలోని పురాతన లక్ష్మీనరసింహాలయం ఆధ్వర్యంలో ధ్యానమందిర పిరమిడ్ మెడిటేషన్ సొసైటీ సమావేశం ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో సింగరాయకొండ ధ్యానమాస్టర్ నర్సారెడ్డి పాల్గొని మాట్లాడుతూ దేవాలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులు చూసి కమిటీసభ్యులను అభినందించారు. రానున్న రోజుల్లో దేవాలయం ప్రాంగణంలో మెడిటేషన్, యోగాక్లాసులు నిర్వహిస్తామని తెలిపారు. ప్రస్తుత కాలంలో ప్రతి ఒక్కరూ యోగా నేర్చుకోవాలని, ఆరోగ్య సమస్యల పరిష్కారంతోపాటు మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. కమిటీ సభ్యులు, జాజుల మాల్యాద్రి, బద్దిక వెంకట నరసింహారావు, కాకుమాను రామారావు, ఉపేంద్ర, నాగలక్ష్మి, పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

చెస్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు ప్రదానం

గురజాల రూరల్: కీర్తి చెస్ అకాడమి పల్నాడు చెస్ అకాడమి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన చెస్ పోటీలకు విశేష ఆదరణ లభించింది. స్థానిక అక్షరా స్కూల్‌లో ఆదివారం చెస్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ పోటీల్లో 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పోటీల్లో గెలుపొందిన చిన్నారులకు బహుమతులు అందించారు.

ఎస్టీఓ కుమార్‌కు సత్కారం

సత్తెనపల్లి: ఇటీవల సాధారణ బదిలీల్లో భాగంగా సత్తెనపల్లి నుంచి పెదకూరపాడు ఉప ఖజానా అధికారి కార్యాలయంకు బదిలీ అయిన ఎస్టీఓ బీఆర్‌కే కుమార్‌కు వీడ్కోలు పలుకుతూ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ బాధ్యులు ఆదివారం సత్కారం చేశారు. ఈ సందర్భంగా ఎస్టీవో కుమార్ సేవలను పలువురు కొనియాడారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కేబీఆర్‌జే ప్రసాద్, గద్దె మురహరిరావు, దాసరి శృంగారం, పి.వెంకటేశ్వరరావు, అంకాళ్ల ప్రభుదాస్, అంబేడ్కర్, నారాయణ, ఇబ్రహీం, మహంకాళి తదితరులు ఉన్నారు.

పేద విద్యార్థినికి ల్యాప్‌టాప్ అందజేత

క్రోసూరు: క్రోసూరుకు చెందిన పేద విద్యార్థిని వడ్లమూడి రూపాంజలి డిగ్రీ మూడవ సంవత్సరం చదువుకుంటుంది. రూపాంజలి విద్యా అవసరాల నిమిత్తం ఆదివారం మాగులూరి ఫౌండేషన్ ల్యాప్‌టాప్ అందించింది. స్థానిక ఎన్టీఆర్ విగ్రహ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో రూపాంజలికి ల్యాప్‌టాప్ అందించారు. కార్యక్రమంలో మాగులూరి ఫౌండేషన్ ప్రతినిధులు కిరణ్ కుంచనపల్లి, మాగులూరి కృష్ణారావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ చెస్ రేటింగ్‌లో ఈశ్వర్ రేవంత్

మాచర్ల రూరల్: పట్టణానికి చెందిన చెస్ క్రీడాకారుడు ఈశ్వర్ రేవంత్ అంతర్జాతీయ ఫీడే రేటింగ్ టోర్నమెంట్‌లో పాల్గొని అంతర్జాతీయ రేటింగ్ క్రీడాకారులను ఓడించి రేటింగ్‌లో 1430 పాయింట్లు సాధించినట్లు చెస్ కోచ్ కె.కిరణ్ కుమార్ తెలిపారు. ఇటీవల విజయవాడలో నిర్వహించిన అంతర్జాతీయ ఫీడే రేటింగ్ టోర్నమెంట్‌లో ఈశ్వర్ రేవంత్ పాల్గొని మంచి ప్రతిభ కనబరచి రేటింగ్ క్రీడాకారులను ఓడించటం ద్వారా ఈ ఘనత సాధించినట్లు చెప్పారు. అంతర్జాతీయ చదరంగ సమైఖ్య శనివారం ప్రకటించిన కొత్త రేటింగ్ క్రీడాకారుల జాబితాలో ఈశ్వర్ పేరును చేర్చినట్లు ఆయన చెప్పారు. మాచర్ల నుంచి పల్నాడు చెస్ అకాడమి తరపున ఘనత సాధించిన 7వ క్రీడాకారుడుగా ఈశ్వర్ గుర్తింపు పొందినట్లు కిరణ్ వివరించారు.

వృద్ధుల హక్కులపై అవగాహన అవసరం

- ప్రిన్సిపల్ సివిల్ కోర్టు జడ్జి (జూనియర్ డివిజన్) కె.నరేందర్‌రెడ్డి
- సీనియర్ సిటిజన్ల హక్కులపై న్యాయ విజ్ఞాన సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి కె.నరేందర్‌రెడ్డి

చిలకలూరిపేట(యడ్లపాడు): తమ పిల్లలు సక్రమంగా చూడకుంటే వారికిచ్చిన ఆస్తులను తిరిగి తీసుకునే హక్కులను తల్లిదండ్రులు కలిగి ఉంటారని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ సివిల్ కోర్టు జడ్జి (జూనియర్ డివిజన్) కె.నరేందర్‌రెడ్డి తెలిపారు. ప్రపంచ వృద్ధుల వేధింపుల నిర్మూలన దినోత్సవంలో భాగంగా ఆదివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. చిలకలూరిపేట మండల న్యాయసేవాధి కార సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని పెన్షనర్స్ అసోసియేషన్ భవనంలో జరిగిన ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ వృద్ధులు ఎదుర్కొంటున్న వేధింపుల నివారణకు పలు చట్టాలు ఉన్నాయని, మండల న్యాయ సేవాధికార సంస్థను ఆశ్రయించి పైసా ఖర్చు లేకుండా ఉచిత న్యాయ సహాయం పొందవచ్చన్నారు. వృద్ధులను తమ బిడ్డలు చూడకుంటే వారిచ్చిన ఆస్తులను తిరిగి తీసుకునే హక్కు ఉందన్నారు. ఇందుకు ఆర్డీఓ, కోర్టును సంప్రదించాలన్నారు. సీనియర్ న్యాయవాదులు పి.వెంకటేశ్వరరావు, టి.రామాంజనేయులు, ఎంఎల్ఎస్‌సీ మెంబర్ ఎం.భానుప్రసాద్, ప్యానెల్ లాయర్ కె.జాషువా, అసోసియేషన్ కార్యదర్శి వెంకటప్ప, షేక్ రహంతుల్లా, పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

మత్తుతో భవిష్యత్తు చిత్తు

- చిలకలూరిపేట రూరల్ సీఐ బి.సుబ్బానాయుడు
- తిమ్మాపురంలో మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై అవగాహన



తిమ్మాపురం తిరుమల నూలుమిల్లులో అవగాహన కల్పిస్తున్న పోలీసులు

యడ్లపాడు: యువత మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా భవిష్యత్తుపై దృష్టి సారించాలని చిలకలూరిపేట రూరల్ సీఐ బి.సుబ్బానాయుడు చెప్పారు. మండలంలోని తిమ్మాపురం తిరుమల నూలుమిల్లులో ఆదివారం రాత్రి మత్తు పదార్థాల వినియోగం, దుష్పరిణామాలపై పోలీసులు కార్మిక కుటుంబాలకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాల వలలో చిక్కుకోవద్దన్నారు. మాదకద్రవ్యాలు, మద్యంకు బానిసలైతే జీవితాలు నాశనం అవుతాయన్నారు. మత్తువలన ఘోర ప్రమాదాలు జరగడమే కాకుండా, మహిళలపై జరుగుతున్న లైంగికదాడులకు కారణాలు కావచ్చని అవగాహన కల్పించారు. ఎస్ఐ టి.శివరామకృష్ణ ప్రస్తుత పరిస్థితుల్లో సమాజంలో పెరుగుతున్న నేరాలపై మిల్లు కార్మికులకు వివరించారు. నేరాల నియంత్రణలో ప్రజల భాగస్వామ్యం కావాలన్నారు. కార్మికులకు పోలీసుల నంబర్లను ఇచ్చారు.

రక్తహీనతను ప్రాథమికంగా గుర్తించాలి

- ప్రముఖ డయాబెటాలజిస్ట్ డాక్టర్ మంజువాణి
- ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో రక్తహీనత శిబిరం



రక్తహీతన గురించి వివరిస్తున్న డాక్టర్ మంజువాణి

చిలకలూరిపేటటౌన్: రక్తహీనత సమస్యను గుర్తించకపోతే, అది దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలకు దారితీస్తుందని ప్రముఖ డయాబెటాలజిస్ట్ డాక్టర్ మంజువాణి హెచ్చరించారు. డాక్టర్ గట్టు రంగారావు సహకారంతో ఇన్నర్‌వీల్ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట, మంజు నర్సింగ్ హోమ్ సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలోని మంజు నర్సింగ్ హోమ్‌లో ఆదివారం ఉచిత అనీమియా(రక్తహీనత) వైద్య శిబిరం జరిగింది. శిబిరంలో పాల్గొన్న మంజువాణి మహిళలకు రక్తహీనతపై అవగాహన కల్పించారు. అలసట, ఊపిరి పట్టినట్టుగా ఉండటం, చర్మం పాలిపోవడం, రక్తపోటు పెరగడం రక్తహీతన లక్షణాలుగా గుర్తించాలన్నారు. శరీరంలో తగినన్ని ఎర్ర రక్తకణాలు లేకుంటే హిమోగ్లోబిన్ తగ్గిపోయి రక్తహీనత వస్తుందన్నారు. ప్రతి ఆర్నెల్లకోసారి రక్తపరీక్షలు చేయించుకుంటూ, ఐరన్ సమృద్ధిగా ఉండే ఆహారం తీసుకోవాలన్నారు. చిన్నపాటి జాగ్రత్తలు పెద్ద పెద్ద ఆరోగ్య సమస్యల నుంచి మనల్ని కాపాడతాయన్నారు. అనంతరం శిబిరానికి వచ్చిన 80 మంది మహిళలకు అవసరమైన వివిధ రకాల ఉచిత రక్తపరీక్షలు, మందుల పంపిణీ నిర్వహించారు. క్లబ్ అధ్యక్షురాలు గట్టు సరోజిని మాట్లాడుతూ తాను అధ్యక్ష పదవి చేపట్టిన ఏడాది కాలంలో క్లబ్ ఆధ్వర్యంలో చేసిన 100వ సేవా కార్యక్రమం కావడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం 101 కార్యక్రమంగా స్థానిక ఎన్ఆర్‌టీ సెంటర్ కూడలిలో రోడ్డు పక్క చిరువ్యాపారం చేసుకునే మహిళకు బ్రాండింగ్ ప్రోగ్రాం కింద గొడుగును అందజేశారు. డాక్టర్ గట్టు రంగారావు, పూర్వాధ్యక్షురాలు తియ్యగూర రమాదేవి, ఇన్‌కమింగ్ సెక్రటరీ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులతో బాధ్యతగా మెలగాలి

న్యాయమూర్తి ప్రియదర్శిని



మాట్లాడుతున్న జడ్జి ప్రియదర్శిని

గురజాల: వృద్ధులను వేధిపులకు గురిచేయరాదని పదో అదనపు జిల్లా కోర్టు జడ్జి జి.ప్రియదర్శిని సూచించారు. మండల పరిధిలోని గంగవరం గ్రామంలో అక్షయ ఫౌండేషన్ వృద్ధాశ్రమంలో ఆదివారం ప్రపంచ వయోవృద్ధుల వేధింపులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వృద్ధుల ప్రాథమిక అవసరాలు తీర్చడంలో నిర్లక్ష్యం వహించరాదని చెప్పారు. వైద్యం లేదా శారీరక సంరక్షణ అవసరాలను విస్మరించినా, వేధింపులకు గురిచేసినా అట్టి వారిపై చర్యలు తీసుకోవచ్చన్నారు. సీనియర్ సివిల్ జడ్జి వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ వృద్ధులు, తల్లిదండ్రుల సంక్షేమ చట్టంను భారత ప్రభుత్వం 2007లో ఏర్పాటు చేసిందన్నారు. చట్టం ప్రకారం వృద్ధులు, తల్లిదండ్రులు వారి సమస్యలను ఆర్డీఓ కార్యాలయంలో తెలిపితే సమస్య పరిష్కరించే విధంగా చూస్తారన్నారు. ఆనంతరం వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోట శ్రీనివాసరావు, కత్తి చలమరాజు, షేక్ జానీబాష, రఫీ,. పి.సురేష్ పాల్గొన్నారు.

సీపీఐ బలోపేతానికి కృషి చేయాలి

సీపీఐ కార్యవర్గ సభ్యులు కొమ్మాలపాటి శరత్‌చంద్ర



మాట్లాడుతున్న కొమ్మాలపాటి శరత్‌చంద్ర జ్యోతిశ్రీ

పెదకూరపాడు: గ్రామీణ ప్రాంతాల్లో సీపీఐని బలోపేతం చేయాలని అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర కార్యదర్శి, సీపీఐ కార్యవర్గ సభ్యులు కొమ్మాలపాటి శరత్‌చంద్ర జ్యోతిశ్రీ అన్నారు. నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడులో ఆదివారం సీపీఐ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సీపీఐ నాయకులు పటాన్ నాగుల్ మీరా అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా శరత్‌చంద్ర జ్యోతిశ్రీ మాట్లాడుతూ ప్రతి సీపీఐ కార్యకర్త పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఏఐటీయూసీ బ్యాంకు ఎంప్లాయిస్ యూనియన్ మాజీ నాయకులు వెల్లలచెరువు మల్లేశ్వరరావు మాట్లాడుతూ సీపీఐ కార్యకర్తలు కలిసికట్టుగా ఉండి సీపీఐ అభివృద్ధికి ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల కోసం వంద సంవత్సరాలుగా అధికారంలో ఉన్నా లేకపోయినా ఎర్రజెండా ప్రజల పక్షాన పోరాటాలు నిర్వహిస్తుందని, ఈ పోరాటాలలో అన్ని వర్గాల ప్రజలు మమేకమై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ప్రజల వైపు నిలబడి పోరాడాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నేలపాటి ఏసోబు, ఎం.రతన్ బాబు, కె.మార్కు, తాళ్లూరి మల్లికార్జునరావు, పి.మస్తాన్, దావీదు, ఎస్‌కే సైదా, నాగేశ్వరరావు, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

వరకట్నం వేధింపులపై నలుగురిపై కేసు

నాదెండ్ల: వరకట్నం వేధింపులపై కేసు నమోదైంది. నాదెండ్ల ఎస్ఐ జి.పుల్లారావు తెలిపిన వివరాల మేరకు.. జంగాలపల్లె గ్రామానికి చెందిన అనూషరాణికి హైదరాబాద్‌లో నివాసం ఉండే రాజేశ్వరరెడ్డితో ఏడాది క్రితం వివాహమైంది. కొద్ది నెలల నుంచి భర్త, అత్తమామలు, ఆడబిడ్డ అధిక కట్నం తేవాలంటూ అనూషరాణిని వేధింపులకు గురి చేస్తున్నారు. దీంతో ఆమె నాదెండ్ల పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు భర్త, అత్తమామలు, ఆడబిడ్డపై కేసు నమోదు చేశారు.

దాతల సహకారంతో బస్‌షెల్టర్



నాదెండ్ల: జాతీయరహదారి గణపవరం ఆర్చ్ వద్ద దాతల సహకారంతో రూ.7 లక్షల వ్యయంతో నిర్మించిన బస్‌షెల్టర్ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. చిలకలూరిపేట ఆర్‌కే హాస్పటల్స్ వైద్యుడు చాపలమడుగు రామకృష్ణ షెల్టర్ నిర్మాణానికి రూ.5 లక్షలు అందించగా, మరికొందరు దాతలు ఆర్థిక సాయం అందించారు. బస్‌షెల్టర్‌లో ఫ్యాన్, లైటింగ్ ఏర్పాటు చేశారు. త్వరలో షెల్టర్ ప్రారంభించనున్నట్లు కమిటీ సభ్యులు కాట్రు శ్రీనివాసరావు, కెల్లంపల్లి అచ్చయ్య, కంచర్ల శ్రీనివాసరావు తెలిపారు.

నీట్ ఫలితాల్లో నిత్య శ్రీ ప్రతిభ



చిలంకూరి నిత్యశ్రీ

మాచర్ల రూరల్: దేశవ్యాప్తంగా లక్షలాది మందితో పోటీ పడి కఠినంగా ఉండే ప్రశ్నాపత్రాలను సాధన కష్టమైన ఇష్టపడి చదివి ఈడబ్ల్యూఎస్‌లో 401వ ర్యాంకు సాధించి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చిన నిత్య శ్రీని పలువురు అభినందించారు. మాచర్ల మండలంలోని రాయవరం గ్రామానికి చెందిన ఆర్ఎంపీ చిలంకూరి శ్రీనివాసరెడ్డి కుమార్తె నిత్యశ్రీ నీట్‌లో భారతదేశ స్థాయిలో 4,500 ర్యాంకు, నీట్‌లో 574 మార్కులు, ఈడబ్ల్యూఎస్‌లో 401 ర్యాంకు సాధించింది. మొదటి ప్రయత్నంలోనే మంచి ర్యాంకు సాధించటంపై ఆమె తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నిత్య శ్రీ మాట్లాడుతూ తాను హైదరాబాద్ మల్లారెడ్డి కళాశాలలో ఇంటర్ చదువుతూ అక్కడే కోచింగ్ తీసుకున్నట్లు తెలిపారు. ఏకాగ్రత, పట్టుదల, పక్కా ప్రణాళిక, సమయపాలనతో విద్యనందుకున్నానని, ముఖ్యంగా గురువులందించిన ప్రతి అంశాన్ని గుర్తుంచుకొని చదువును కొనసాగించానన్నారు.

త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ప్రచారం



ఆవులవారిపాలెం(క్రోసూరు) : జూలై 10వ తేదీన గురు పౌర్ణమి పురస్కరించుకుని ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు దివ్య ఆశీస్సులతో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక పిడుగురాళ్ల, చిలకలూరిపేట కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని ఆవులవారిపాలెం, పెరికపాడు గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ గ్రంథాల ప్రచారం నిర్వహించారు. శ్రీకృష్ణుడిని జగద్గురువుగా పూజించాలని వివరించారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి సభ్యులు కటికం సైదారావు, యద్దనపూడి వీరాంజనేయులు, కె.అరుణ, కె.కార్తీక్, కె.నారాయణమ్మ, సీహెచ్ అనురాధ, ఎన్. వెంకటలక్ష్మి, డి.శ్రీను, ఎం.వీరయ్య, టి.రాఘవ, వి.సుందరం, వై.రామాంజనేయులు, కె.గంగయ్య, కోటేశ్వరమ్మ, వెంకటేశ్వర నాయక్ పాల్గొన్నారు.

20న చౌడేశ్వరి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం



రెంటచింతల: స్థానిక తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని చౌడేశ్వరి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం ఈ నెల 20వ తేదీ నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త శీలం నారాయణ, పెద్దశెట్టి జోకా కొండలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 5 గంటలకు సుప్రభాతసేవ, 6 గంటలకు వేద పారాయణం, 7.30 గంటలకు మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, 10 గంటలకు అమ్మవారికి బోనాలు సమర్పణ, 11 గంటలకు అమ్మవారికి సహస్రనామార్చన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు ఓరుగంటి మారుతిశర్మ నేతృత్వంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, పలు రకాల అభిషేకాలు నిర్వహించిన అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేయడం జరుగుతుందని వివరించారు.

ఏం సాధించారని సంబరాలు?

- ఖాళీ పోస్టులపై శ్వేతపత్రం ఏదీ..?
- రూ.3వేల నిరుద్యోగ భృతి ఎక్కడ!
- ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి సుభాని



పోస్టర్ ఆవిష్కరించిన ఏఐవైఎఫ్ నాయకులు

చిలకలూరిపేట(యడ్లపాడు): ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ఏఐవైఎఫ్(ఆల్ ఇండియా యూత్ ఫెడరేషన్) రాష్ట్ర సహాయ కార్యదర్శి సుభాని డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్లు ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా సంబరాలు చేయడం సిగ్గు చేటన్నారు. ఏడాదిలో ఏం సాధించిందో రాష్ట్ర ప్రజలకు చెప్పాలని ప్రశ్నించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రతి నిరుద్యోగికి భృతి కింద రూ.3వేలు చెల్లిస్తామంటూ హామీలు గుప్పించి, నిరుద్యోగుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం వారి ఆశలపై నీళ్లు చల్లిందని సుభాని మండిపడ్డారు. రాష్ట్రంలో 1.56 కోట్ల మందికి పైగా నిరుద్యోగులు ఉన్నారని ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయని, వీరికి ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన అవసరం ప్రభుత్వానికి ఉందని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో లక్షలాది ఖాళీ పోస్టులు ఉన్నాయని గుర్తు చేస్తూ, ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేసి తక్షణమే ఉద్యోగాలు కల్పించాలని సుభాని డిమాండ్ చేశారు. నెలకు రూ. 3వేల నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చి సంవత్సరం గడిచినా ఒక్క నిరుద్యోగికీ కూడా భృతి పంపిణీ చేయపోవడం పాలనా వైఫల్యమే అన్నారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు నిరుద్యోగ భృతిని అమలు చేయకపోతే, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ ఏరియా కార్యదర్శి కె.మల్లికార్జున్, పట్టణ కన్వీనర్ రాంబాబు నాయక్, నాయకులు రవి, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

పీఆర్ మోహన్‌కు ఘననివాళి



సంస్మరణ సభలో పాల్గొన్న ప్రముఖులు, కళాకారులు

చిలకలూరిపేటటౌన్: కళా రంగానికి అంకితమై, ఎందరో కళాకారులకు మార్గదర్శకుడిగా నిలిచిన కళానిలయం సంస్థ వ్యవస్థాపకులు ప్రగడ రాజ మోహనరావు (పీఆర్ మోహన్) సంస్మరణ సభ పట్టణంలో ఆదివారం ఘనంగా జరిగింది. స్థానిక ఆర్‌వీఎస్‌సీవీఎస్ హైస్కూల్ రోడ్డులోని హరినాథ్ బాబా మందిరంలో స్థానిక కళాసంస్థలు, ప్రజా నాట్యమండలి, జన విజ్ఞాన వేదిక సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. ముందుగా పీఆర్ మోహన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రముఖులు, కళాకారులు అశ్రునయనాలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏపీ శివయ్య, గంజి పోలయ్య, మున్సిపల్ మాజీ ప్రతిపక్ష నాయకులు జమాల్‌బాషా, సలీం, పేలూరు రామారావు, పేరుబోయిన వెంకటేశ్వర్లు, డాక్టర్ పీవీ సుబ్బారావు, డాక్టర్ గట్టు రంగారావు వంటి వక్తలు పీఆర్ మోహన్ వ్యక్తిత్వం, కళా రంగానికి ఆయన అందించిన సేవలను కొనియాడారు. సభకు అధ్యక్షత వహించిన ఏపీ శివయ్య మాట్లాడుతూ చిలకలూరిపేట ఖ్యాతిని నలుదిశలా చాటిన మహనీయుడు ప్రగడ రాజమోహన్‌రావు అని కీర్తించారు. పీఆర్ మోహన్‌తో తమకున్న అనుభవాలను, మధురానుభూతులను తోటి కళాకారులు పంచుకుంటూ, కళానిలయం ద్వారా ఆయన పరిచయం చేసిన కళాకారులు అసంఖ్యాకమని ప్రశంసించారు. ఆయన లేని లోటు తీర్చలేనిదని పేర్కొంటూనే, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని సంకల్పించారు.

స్ట్రీట్ వెండర్ హాకర్ జోన్లు ఏర్పాటు చేయాలి

- సర్వే చేసి వారికి గుర్తింపు కార్డులు ఇవ్వాలి
- న్యాయవాది, సామాజిక కార్యకర్త నరిశేటి వేణుగోపాల్



సత్తెనపల్లి: పట్టణంలో రోడ్లకు ఇరువైపులా చిరు వ్యాపారాలు చేసే వారి కోసం వినియోగదారులకు అందుబాటులో ఉండే ప్రాంతాలను గుర్తించి 'స్ట్రీట్ వెండర్ హాకర్ జోన్లు' ఏర్పాటు చేసే విధంగా సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి తగు చర్యలు చేపట్టాలని స్థానిక శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణకు న్యాయవాది, సామాజిక కార్యకర్త నరిశేటి వేణుగోపాల్ ఆదివారం విజ్ఞప్తి చేశారు. సత్తెనపల్లి పట్టణంలో రోడ్లకు ఇరువైపులా తోపుడు బండ్లు, కూరగాయలు, పండ్లు, కొబ్బరి బొండాలు, పూల దుకాణాలు యథేచ్ఛగా, ఇష్టారీతిన వీధి వ్యాపారాలు జరుగుతున్నాయని, వీటితో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. జన సమర్థం ఎక్కువగా ఉండే సత్తెనపల్లి చెక్‌పోస్ట్ నుంచి గడియార స్తంభం మీదుగా ఆర్టీసీ బస్టాండ్ వరకు, గాంధీ బొమ్మల సెంటర్, గార్లపాడు బస్టాండ్ రోడ్, రైల్వే స్టేషన్ రోడ్, రిజిస్ట్రార్ ఆఫీస్ రోడ్, అచ్చంపేట రోడ్, గోళ్ళమూడి వారివీధి ఇలా సత్తెనపల్లి పట్టణంలో అనేక ప్రాంతాల్లో వీధి వ్యాపారాలు నిర్వహిస్తుండటంతో ట్రాఫిక్‌కు అంతరాయంతోపాటు, వాహనదారులు, పాదచారులు తీవ్ర అసౌకర్యానికి లోనవుతున్నారన్నారు. అనేక సందర్భాల్లో ప్రజలు, వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. పట్టణంలోని ప్రధాన రహదారికి ఇరువైపులా ఫిష్, మటన్ అమ్మకాలు జోరుగా జరుగుతున్నాయని, ఎక్కడ పడితే అక్కడ ఫిష్, మటన్, బీఫ్ అమ్మకాలు జరపకుండా 'నిర్దేశించిన ప్రదేశాలలో' మాత్రమే వ్యాపారాలు నిర్వహించుకొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. తక్షణమే సంబంధిత అధికారులు స్ట్రీట్ వెండర్స్ సర్వే నిర్వహించి గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని ఆయన కోరారు.

నేడు గిరిజన సంక్షేమ పాఠశాలలో ప్రవేశ పరీక్ష



ప్రిన్సిపాల్ సింహాద్రి మోహన్

రెంటచింతల: స్థానిక ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకున్న బాలురకు సోమవారం పాఠశాలలో ప్రవేశపరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సింహాద్రి మోహన్ తెలిపారు. ఆదివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. తరగతుల వారిగా పరీక్ష నిర్వహించనున్నట్లు చెప్పారు. ఖాళీలను తరగతుల వారిగా రోస్టర్ విధానంలో భర్తీ చేయడం జరుగుతుందని వివరించారు. ఎస్టీలకు 78 శాతం, ఎస్సీలకు 12 శాతం, బీసీలకు 5 శాతం, ఓసీలకు 2 శాతం, పీహెచ్‌సీలకు 3 శాతం చొప్పున రిజర్వేషన్ అమలు చేస్తామన్నారు. 5వ తరగతిలో 40 ఖాళీలు, 6వ తరగతిలో 10 ఖాళీలు, 9వ తరగతిలో 9 ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. బ్లాక్‌లాగ్ సీట్లకు ఎస్టీలు మాత్రమే అర్హులన్నారు. 5వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఆంగ్ల మీడియంలో ఉచితంగా విద్య బోధించడం జరుగుతుందని చెప్పారు.

బీసీల సమస్యలపై ఐక్యంగా పోరాడాలి



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు యాదవ్

గురజాల: పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కరించుకోవచ్చని అఖిలభారతీయ యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు యాదవ్ పేర్కొన్నారు. స్థానిక పల్నాడు కన్వెన్షన్ హాల్‌లో అఖిల భారతీయ యాదవ మహా సభ ఆధ్వర్యంలో గురజాల, మాచర్ల నియోజకవర్గాల సమీక్ష సమావేశం ఆదివారం నిర్వహించారు. సమావేశానికి పల్నాడు జిల్లా అధ్యక్షుడు సిద్దాడపు గాంధీ అధ్యక్షత వహించారు. వెంగళరావు యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన నిరసనల కారణంగానే కేంద్ర ప్రభుత్వం కులగణన చేపట్టిందని చెప్పారు. రాజ్యాధికారం కోసం కొన్ని పార్టీలు కూటమిగా ఏర్పడి విజయం సాధిస్తున్నాయి. కానీ బీసీలంతా కూడా కూటమిగా ఏర్పడి రాజ్యాధికారం కోసం ఎందుకు ముందుకు సాగడం లేదని చెప్పారు. జనాభా ప్రతిపాదికన రాజ్యాధికారం కోసం బీసీలకు అర్హత ఉందన్నారు. గాంధీ మాట్లాడుతూ బీసీలు రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలంటే మనందరం ఒక తాటిపై ఉండి రాజ్యాధికారం కోసం పాటుపడాలన్నారు.